(10)

# సుడిగాలిలోని దీపం

రచన : శ్రీమతి ఆర్. వసంత

ఆరోజునుండి రాధ తనగ్రామంలోనే వుంటూ, తన తండ్రికి జరుగవలసిన అంత్యక్రియలు, ఏ కొదువ లేకుండా ఘనంగా జరిపించింది.

ప్రతిరోజు మామయ్య భూషయ్య, రవి, రాధ యింటికి వచ్చి, రాధకు కావలసినవి చూస్తూ పోసాగారు. రాధ యింటికివచ్చి 1 నెల అయిననూ, రవి రాధతో 1, 2 పర్యాయాలు కలుశాడేగాని, చనువుగా, ముందులాగ మాట్లాడి ఎరుగడు.

తన తండ్రి పోయిన యింటిలో, రాధకు వుండలేక పోయింది. ఎక్కడ చూస్తేను, తండ్రిముఖమే కనబడు తుంది. తన్ను పిలుస్తున్నట్లు బాధపడసాగింది.

ఒకరోజు రాధ తన బెడ్డుమీద పడుకొని, రవి, తాను పంట పొలాలమీద తిరిగిన, ఆ మధుర స్వప్నాలు తలచుకొని, బాధగా కుమిలిపోసాగింది.

తలుపు తెరచుకొని రవి 'ఏమిటి రాధ ! ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నావు ?' అని లోనికివచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

రాధ ప్రక్కకు తిరిగి కన్నీళ్ళు తుడుచుకొంటూ 'రా బావ ! యిన్నిరోజులకు నేను కనిపించానా, అని పడక మంచంలో కూర్చున్నది.

'రాధ ! నీవు ఎక్కడవున్నా, ఎలావున్నా ఎప్పుడూ, నామనసులో మెదులుతూ, శాశ్వతంగా వుంటూన్నావు. నీదగ్గరకు నేను ఎందుకు వస్తాను. నీవే నాలో వుండగా' అని బాధగా చెప్పలేకపోయాడు.

రాధ బాధతో కన్నీరు కారుస్తూ, 'అవును బావ. ప్రేమ అనే పదానికి నీవు జీవంపోసి, నన్నే శాశ్వతంగా నీమనసులో కట్టిపడేశావు. కాని, కాని, నాజీవితమే బావ ఎందుకూ పనికిరాకుండా ఎవ్వరికి వుపయోగం లేకుండా పోయింది' అని అంటూ బోరున ఏడ్చింది.

రవి, రాధ పక్క కూర్చొని, 'ఛ, ఏమిటి చిన్న పిల్లాడిలాగ ! అయిన నీకేం కొదవ. లంకంతటి యిల్లు, నిన్ను చూచుకొనేందుకు నాన్న, నేను వుంటున్నాము కదా ! ఏ కష్టం కలుగకుండా చూసుకొంటాము' అని తల నిమురుతూ చెప్పసాగాడు.

రాధ ప్రక్కనున్న రవి ఒడిలో పడుకొని, 'బావా ! నా జీవితమే నాశనమైనది. కన్నతండ్రి నిన్ను కాదని వేరొకనికి పెండ్లి చేశాడు. అతను యీనాటివరకు నన్ను ముట్టుకొని ఎరుగడు. భర్తదగ్గర ప్రతిరోజు దిన మొక యుగంలాగ భయపడుతూ బ్రతికేదాన్ని. ప్రాణానికి ప్రాణంగ నన్ను ప్రేమించే నీకే దూరమయ్యాను. అందుకోసం నీ జీవితం నాశనంచేశాను. నావలన నాన్నను, అత్తయ్యనూ, నిన్ను పోగొట్టుకొన్నాను. నన్ను క్షమించు బావా ! క్షమించు అని ఒడిలో ఏడుస్తూ చెప్పసాగింది.

తనలోని ప్రాణమైన రాధ ఏడుస్తూవుంటే. తాను మనసులోనే ఏడుస్తూ ఏమి చెప్పలేని నిస్సాయస్థితిలో రాధ తలను తన చేతులతో నిమురసాగాడు.

రెండు మూడు నిముషాలు రాధ గుండెలు పగిలేవిధంగా ఏడ్చి ఏడ్చి. తర్వాత మనసును కొంత తేలికచేసుకొని. లేచి కూర్చుని కన్నీళ్ళు తుడుచుకొంటూ 'బావా ! నా మనసేమో బాగుగాలేదు. ఈ యింటిలో ఎక్కడచూస్తేనూ, నాన్న తిరుగుతున్నట్లు. మెదులుతున్నట్లు కనిపిస్తున్నారు. కొంతకాలం వుద్యోగం చేయాలని వుంది. ఆవిధంగా అయినా కొంతకాలం మనసుకు విశ్రాంతి లభించాలని వెళుతున్నానేకాని మరేవిధంగా కాదు. నీవేమంటావు బావా!' అని అంటూ రవి ముఖంలో చూడసాగింది.

రవి రెండునిమిషాలు ఆలోచించి, 'అలాగే రాధ ! స్థలం మార్చడంవలన నీకు సంతోషం కలుగుతుందంటే సంతోషంగా వెళ్ళిరా' అన్నాడు.

రాధ 'మరొక్కమాట. నాకు ప్రమాణం చెయ్యాలి బావా' అని చెయ్యి చాపింది.

'ఏమిటది ?'

'నా మనశ్శాంతికోసం వుద్యోగం చేయడానికి వెళ్ళుతున్నాను. కాని, అక్కడకూడా నాకు నాజీవితంలో సుడిగాలి వీస్తే, యీ అభాగ్యురాలిని, నీ రాధను చేరదీస్తావా' అని చెయ్యిచాపి దీనంగా అడగసాగింది.

రవి రాధను కౌగలించుకొని, కండ్లు మూసుకొని తనివితీరా, 'రాధా ! రాధా ? అంటూ, 'నామనసులో నీవు దేవతగా వుంటున్నావు రాధ ! నా ప్రాణం నీకోసమే వున్నది. నీకేమైనా జరిగితే, యీ రవి లేడు అని చెప్పాడు,

రాధ కౌగిళినుండి వీడుతూ. 'చాలు బావ చాలు ! నాకు ఒకరు వున్నారనే ధైర్యంతో సంతోషంగా వెళతాను, అన్నది.

బయటనుండి భూషయ్య తన కొడుకు రవికోసంవస్తూ, 'ఏమ్మా, ఎలావున్నావు. నీకేమైనా కష్టంవస్తే, మేమున్నా వమ్మ' అన్నాడు.

రాధ పడకమంచంనుండి లేచి 'రండి మామయ్య రండి' అని కుర్చీ చూపించింది.

భూషయ్య కుర్చీలో కూచుంటూవుండగా రవి 'నాన్న ! రాధ కొంతకాలం మనల్ని వదలి, బయటవూరికి వెళ్ళతా నంటుంది' అన్నాడు.

భూషయ్య, 'నిజమేనామ్మా ! మావలన నీకేమైనా కష్టంగా వుందామ్మా' అని అంటూవుండగా—

'అంతటిమాట అనకండి మామయ్య, నా తండ్రికన్న ఎక్కువగాచూచే మీరు, ప్రాణంలో ప్రాణంగాచూచే బావను వదలి వెళ్ళాలంటే నాకు బాధగావుంది, యిక్కడ నా మన పేమీ బాగుగాలేదు. నాన్న ఎప్పుడూ నా కన పడుతూ వున్నారు. నా మనశ్శాంతికోసం వుద్యోగం చేద్దా మని వుంది. ఈరోజే నాకు ఆర్డరు వచ్చింది. విజయవాడ లోని ఒక కంపెనీలో అకౌంటెంటుగా ఆర్డరు యిచ్చారు. అని ఆర్డరు కాగితం బావకు అందించగా, బావ చదివి, వారి నాన్నకు యిచ్చాడు.

భూషయ్య, 'అలాగేనమ్మా, నీవు ఎక్కడవున్నా ఆనందంగా, కష్టంలేకుండా వుండాలి. ఇదేనమ్మ భగవం తుని ప్రార్థిస్తున్నాను' అని అన్నాడు.

రాధ, 'చాలా సంతోషం మామయ్య. యిక్కడ పంట పొలాలు కౌలు కిచ్చేయండి. పేదరైతులు బాగా పండించు కోని, వారిసంతోషంలో నాన్నను చూసేభాగ్యం నాకు కలుగుతుంది. నా ఒక్కదానికి, ఎక్కువధాన్యం కావాలా ? సంవత్సరమునకు 2, 3 బస్తాలు ధాన్యం చాలు. కొద్ది రోజులు నా కాళ్ళమీద నేను నడవాలని వుంది' అని చెప్పింది.

అలాగే 2 రోజులు తర్వాత విజయవాడవచ్చి క్రొత్త కంపెనీలోని వుద్యోగంలో చేరాను, వచ్చేసమయంలో బావను వదలి వెళ్ళిపోతున్నామే అని మనసు ఆరాటపడ సాగింది.

ఇలాగ విజయవాడ ఆఫీసులో పనిచేస్తూవుండగా, ఒక రోజు నాపేరున రిజిష్టరు కవరు వచ్చింది. తీసుకొని విప్పి చూడగా, నాభర్త గోపాల్ కోర్టుద్వారా, నాకు విడాకులు యిప్పించారు. నా నడత బాగులేదని, 1 సంవత్సరంగా నాకు, అతనికి ఏవిధమైన సంబంధము లేనందువలన, విడాకులు యివ్వవలసి వచ్చిందని తెలియబరచి వుంది.

'కలకాలం ఆయన అనేకవ్యసనాలకు బానిసై, నన్ను చెడినదాన్నిగా తెలుపుతూ, విడాకులు యిచ్చాడు' అని చెప్పసాగింది.

జానకి బాధపడుతూ, 'నీకు చేసిన అన్యాయానికి భగ వంతుడే శిక్షిస్తాడమ్మా' అన్నది. రాఘవరావు, 'విచారించ కమ్మ ! ఎల్లప్పుడూ కష్టకాలంగా మానవజీవితం వుండ దమ్మ ! చీకటి తర్వాత వెన్నెల వచ్చేవిధంగా, కష్టాలు తర్వాత సుఖము రాకపోదు' అని ఓదార్చాడు.

సాయంత్రం నాలుగు గంటలు కావడంవలన సీతాలు, వచ్చింది. ఇంతలో రాఘవరావు, జానకి బయలుదేరడానికి లేస్తూ, 'వస్తానమ్మ, ఈ ఆదివారం సంతోషంగా వుండే దినం. కాని మేమువచ్చి, నీ గతస్మృతులు త్రవ్వి తీసి. నీకు కష్టం కలిగించాను' అని రాఘవరావు అనగా—

'అదేమి లేదు బాబాయిగారు నా గుండెబరువు కొంత దిగి నామనసు తేలికగా వుంది. నాకష్టాన్ని పంచుకొనేవారు వున్నారని సంతోషిస్తున్నాను' అని రాధ చెప్పింది.

జానకి 'వస్తానమ్మ ! నీకు కష్టంగావుంటేనూ, ఏది కావాలన్ననూ కబురు పెడతావా !' అనగా—

రాధ 'అలాగేనమ్మ' అని వారిరువురిని గుమ్మందాకా సాగనంపింది.

[ఇంకావుంది]

ఎల్లప్పుడూ.........

టి. ఎన్. హెచ్. వారి

* సైనిక్స్ * ఆర్. ఓ.

కలర్ బనిన్లనే

ఉపయోగించండి.

TRADE MARK

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు :—

దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం - 4.